క్లుప్తంగా

సీసీ డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన



అమరావతి: మండల పరిధిలోని కర్లపూడి ఎస్సీ కాలనీలో రూ.10 లక్షల మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో సిమెంట్ సైడ్‌కాల్వల నిర్మాణానికి గురువారం పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో మురుగునీరు బయటకు పంపి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచటానికి సైడ్ కాల్వలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నంబూరు బాబురావు, వీర రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

రాళ్ల దాడిలో బాలికకు గాయాలు

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల బీసీ కాలనీలో రెండు వర్గాల మధ్య జరిగిన రాళ్ల దాడిలో బాలికకు గాయాలైన ఘటన బుధవారం రాత్రి జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీసీ కాలనీకి చెందిన తమ్మిశెట్టి, బండారు కుటుంబాల మధ్య వివాదం నెలకొంది. నకిలీ బంగారానికి సంబంధించి పోలీసులకు సమాచారం అందిస్తున్నారనే నెపంతో ఒకరిపై ఒకరు దూషణలకు దిగి రాళ్ల దాడి చేసుకున్నారు. ఈ దాడిలో బండారు మధు అనే బాలిక తలకు రాయి తగిలి గాయమైంది. గాయపడిన మధును చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.కిశోర్‌బాబు తెలిపారు.

నేటి నుంచి సామాజిక కులగణన

నకరికల్లు: ప్రభుత్వం చేపడుతున్న సామాజిక కులగణన జనాభా ప్రాతిపదికన నిధుల కేటాయింపు, అర్హులందరికీ పథకాలు అందించేందుకు దోహదపడుతుందని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోను సామాజిక కులగణన శుక్రవారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలోని వలంటీర్ తనకు కేటాయించిన యాప్‌లో వివరాలు నమోదు చేస్తారని అన్నారు. వలంటీర్, సచివాలయ సిబ్బంది ఇళ్లకు వెళ్లి సామాజిక పరిస్థితులు, కులవివరాలను సేకరిస్తారని అన్నారు. కులగణనలో వాస్తవ వివరాలు తెలియజేయాలని ప్రజలను ఆయన కోరారు. కులగణన కారణంగా ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలకు ఎలాంటి ఆటంకం కలగదన్నారు. వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి సహకరించాలని కోరారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు



మాచర్ల రూరల్: హిందువుల ఆరాధ్య దైవమైన రాముని విగ్రహం అయోధ్యలో ప్రతిష్ట చేయటం మనందరికీ గర్వకారణమని ఆలయ అర్చకులు కేశవ, మురళి అన్నారు. గురువారం మండలంలోని కంభంపాడు గ్రామంలో అయోధ్య రామాలయ ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులతో నిర్వహించిన ఊరేగింపులో భక్తులనుద్దేశించి మాట్లాడారు. ఈ నెల 22వ తేదీన ప్రతిష్ట మహోత్సవం జరుపుకోవటం మనందరి అదృష్టమన్నారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ప్రతి ఒక్కరూ తమ ఇంటిలో ఉంచుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో అలివేలమ్మ, వెంకటనర్సమ్మ, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు తదితరులున్నారు.

ప్లాస్టిక్ మయంగా డ్రైనేజీలు



కారెంపూడి: డ్రైనేజీలు కారెంపూడిలో ప్లాస్టిక్ వ్యర్థాలతో ప్రవహిస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుపడి కాల్వల్లో మురుగు నీరు కూడా సక్రమంగా పారడం లేదు. అనేక చోట్ల మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. పారిశుద్ధ్య కార్మికులు కూడా కాల్వల నుంచి వీటిని బయటకు తీయడానికి నానా కష్టాలు పడుతున్నారు. ప్లాస్టిక్‌తో ముడిపడిన నిత్యావసర వస్తు వినియోగం రోజురోజుకు పెరుగుతుండడంతో ఈ పరిస్థితి దాపురించింది. దీనిపై అప్రమత్తత లేకపోతే ప్రాణాలకే ప్రమాదమని కారెంపూడికి చెందిన పర్యావరణ ప్రేమికుడు సాక్షి ఎక్స్‌లెన్స్ అవార్డు గ్రహీత కొమెర జాజి హెచ్చరిస్తున్నారు.

ఉత్సాహంగా ‘ఆడుదాం ఆంధ్రా’

- నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించిన 10 జట్లు
- 24 నుంచి నియోజకవర్గస్థాయి పోటీలు ప్రారంభం



నియోజకవర్గ స్థాయికి అర్హత సాధించిన గుడిపూడి వాలీబాల్ జట్టు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘ఆడుదాం ఆంధ్రా’ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్ నుంచి 10 జట్లు అర్హత సాధించాయి. గత నెల 26 నుంచి ఈ నెల 9 వరకు గ్రామ సచివాలయ స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. సత్తెనపల్లి పట్టణంలో 15 సచివాలయాలు, సత్తెనపల్లి రూరల్‌లో 19 సచివాలయాలు కలిపి 34 సచివాలయాల స్థాయిలో క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆ పోటీల్లోని విజేతలు మండల స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ నెల 10 నుంచి మండల స్థాయి పోటీలు ప్రారంభించగా తమలో దాగివున్న క్రీడా ప్రతిభను ప్రదర్శించి విజేతలుగా నిలిచారు. సత్తెనపల్లి పట్టణం నుంచి ఐదు జట్లు, సత్తెనపల్లి రూరల్ మండలం నుంచి ఐదు జట్లు, మొత్తం పది జట్లు నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలకు అర్హత సాధించాయి. ఈ నెల 24 నుంచి 30 వరకు నియోజకవర్గ స్థాయిలో జరగనున్న క్రీడా పోటీల్లో పది జట్లు ప్రాతినిధ్యం వహించనున్నాయి.

నియోజకవర్గస్థాయికి అర్హత సాధించిన జట్లు...

‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడా పోటీల్లో మండల స్థాయిలో ప్రతిభ కనబరిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు 10 జట్లు ఎంపికయ్యాయి. ఎంపికైన జట్ల వివరాలు ఇలా... వాలీబాల్ పోటీలకు బాల, బాలికల విభాగం నుంచి రెండు జట్లు గుడిపూడి నుంచి ఎంపికయ్యాయి. కబడ్డీ పోటీలకు బాలికల విభాగంలో సత్తెనపల్లి మండలం కొమెరపూడి, బాలుర విభాగంలో సత్తెనపల్లి పట్టణం శాలివాహననగర్ జట్లు, బ్యాడ్మింటన్ పోటీల్లో బాలుర విభాగంలో సత్తెనపల్లి పట్టణం వెంకటరెడ్డినగర్, బాలికల విభాగంలో సత్తెనపల్లి రూరల్ కంకణాలపల్లి, క్రికెట్ పోటీల్లో బాలుర విభాగంలో సత్తెనపల్లి పట్టణంలోని పాత సాలిపేట, బాలికల విభాగంలో సత్తెనపల్లి పట్టణం వెంగళరెడ్డినగర్, ఖోఖో పోటీల్లో బాలుర విభాగంలో నందిగామ-1, బాలికల విభాగంలో సత్తెనపల్లి పట్టణం వెంగళరెడ్డినగర్ సచివాలయ జట్లు అర్హత సాధించాయి.

విజేతలను మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మండల చీఫ్ కోచ్ ఆరిక శ్రీరామిరెడ్డి, మున్సిపల్ మేనేజర్ సాంబశివరావు, పీడీలు ప్రత్యేకంగా అభినందించి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

యువత క్రీడా స్ఫూర్తితో మెలగాలి

సత్తెనపల్లి: క్రీడాకారులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు అన్నారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లోని క్రీడాకారులకు గురువారం టీ షర్టులను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు, ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తుందన్నారు. సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. యువతను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి చిలక జైపాల్, ధూళిపాళ్ల ది ఆంధ్ర బ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివన్నారాయణలు మాట్లాడారు. అనంతరం క్రీడాకారులకు టీ షర్టులను బహూకరించారు.

తుది దశలో మండల స్థాయి క్రీడా పోటీలు

అచ్చంపేట: స్థానిక తుమ్మేపల్లి శ్రీరాములు జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. గురువారం కబడ్డీ, క్రికెట్ పోటీలు జరిగాయి. అచ్చంపేట-1, కోనూరు జట్ల మధ్య జరిగిన క్రికెట్ పోటీలో అచ్చంపేట-1 జట్టు విజయం సాధించింది. చల్లగరిగ-కోగంటివారిపాలెం జట్ల మధ్య జరిగిన పోటీలో కోగంటివారిపాలెం జట్టు, వేల్పూరు-పెదపాలెం జట్ల మధ్య జరిగిన కబడ్డీ పోటీలో పెదపాలెం జట్టు, చింతపల్లి-అచ్చంపేట-2 జట్లలో అచ్చంపేట-2 జట్టు, కోగంటివారిపాలెం-గ్రంధశిరి జట్లలో కోగంటివారిపాలెం జట్టు, ఓర్వకల్లు-చల్లగరిగ జట్లలో చల్లగరిగ జట్టు, కస్తల-తాడువాయి జట్ల మధ్య జరిగిన పోటీలో తాడువాయి, అచ్చంపేట1-చిగురుపాడు జట్లలో అచ్చంపేట1, కొండూరు-తాళ్లచెరువు మధ్య జరిగిన పోరులో కొండూరు జట్టు విజయం సాధించాయి.



అచ్చంపేట1-చింతపల్లి జట్ల మధ్య జరిగిన కబడ్డీ పోటీ



ముప్పాళ్ళలో లంకెలకూరపాడు-చాగంటివారిపాలెం జట్ల మధ్య కబడ్డీ పోటీ

ముప్పాళ్ళలో హోరాహోరీగా ఆటల పోటీలు

ముప్పాళ్ళ: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా జరుగుతున్న ఆటల పోటీలు తుది దశకు చేరుకున్నాయి. ఆయా గ్రామాల జట్లు విజేతలుగా నిలిచేందుకు పోటీ పడుతున్నాయి. గురువారం జరిగిన క్రికెట్ పోటీలో పలుదేవర్లపాడు, నార్నెపాడు జట్లు ఫైనల్‌కు చేరాయి. వాలీబాల్ పోటీల్లో ముప్పాళ్ళ జట్టు, కబడ్డీ పోటీల్లో మాదల జట్టు విజేతగా నిలిచింది. బ్యాడ్మింటన్, క్రికెట్ విభాగాలలో ఫైనల్ మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. ఆయా పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.కె.ఎమ్.సుభాని, జి.నరసింహారావు, యు.సత్యవతి వ్యవహరించారు.

గ్రామాల అభివృద్ధిని ప్రణాళిక బద్ధంగా చేపట్టాలి



ముప్పాళ్ళ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024-25పై సర్పంచ్‌లకు, ఎంపీటీసీ సభ్యులకు, ఆయా శాఖల మండల స్థాయి అధికారులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో పీ పుట్టారెడ్డి మాట్లాడుతూ శిక్షణలో అందించిన అంశాలపై గ్రామాల్లో చర్చించి ప్రణాళికలు సిద్ధం చేసి పంచాయతీల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు అందించే నిధుల ద్వారా చేపట్టే అభివృద్ధి పనులను ప్రణాళిక బద్ధంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రూపవతి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, ఆయా శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బాలరాముని ప్రతిష్ట రోజున అన్నదానం

అమరావతి: రామజన్మభూమి అయోధ్యపురిలో బాలరాముని ప్రాణప్రతిష్ఠామహోత్సవం జరిగే ఈనెల 22వ తేదీన స్థానిక పత్తి ఫ్యాక్టరీ బజారులో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు గోరింట్ల బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత విశ్వహిందూపరిషత్ ప్రముఖులచే సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు భక్తులందరికి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీరాముని కృపకు పాత్రులు కావాలని కోరారు.

సమాజం సుభిక్షంగా ఉండాలి

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- పట్టణంలోని 28వ వార్డులో ఉరుసు మహోత్సవం

సత్తెనపల్లి: సమాజం సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని 28వ వార్డులో జరిగిన ఉరుసు మహోత్సవంలో గురువారం రాత్రి ఆయన పాల్గొని మాట్లాడారు. అల్లా చల్లని దీవెనలు అందరికీ ఉండాలని వేడుకొన్నారు. ఈ సందర్భంగా జరిగిన గంధ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు తదితరులున్నారు.



పట్టణంలో ఉరుసు మహోత్సవంలో అల్లాను ప్రార్థిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సేవారత్న అవార్డుకు కొత్త లక్ష్మయ్య

సత్తెనపల్లి: పట్టణానికి చెందిన కొత్త లక్ష్మయ్య వాసవి సేవా సమితి సంస్థ అందించే సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. గురువారం గాంధీచౌక్‌లోని దేవతి సుబ్బారావు దుకాణం వద్ద కొత్త లక్ష్మయ్యను ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు అభినందించి సన్మానించారు. నరసరావుపేటలోని వాసవి సేవా సమితి సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అనేక ప్రాంతాల్లో విశిష్ట సేవలందించిన వారికి సేవారత్న అవార్డులు అందిస్తున్నారు. అందులో భాగంగా పట్టణంలోని అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు విశిష్ట సేవలందించినందుకు గాను కొత్త లక్ష్మయ్య ఎంపికయ్యారు. అవార్డును సంస్థ తరపున కట్టమూరి అప్పారావు అందించి సత్కరించారు. లక్ష్మయ్య అందించిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో మద్ది వెంకటేశ్వరరావు, కొత్త రామకృష్ణ, జమిలి రాధాకృష్ణమూర్తి, కొత్తూరి విశ్వేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు, చేవూరి నాగేశ్వరరావు, కటకం నరసింహారావు పాల్గొన్నారు.



కొత్త లక్ష్మయ్యను అభినందిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ప్రకృతి వ్యవసాయం చేద్దాం .. పెట్టుబడులు తగ్గిద్దాం

పెదకూరపాడు: ప్రకృతి వ్యవసాయం చేసి ప్రకృతిని కాపాడుకునేందుకు రైతులు ముందుకు రావాలని పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి అన్నారు. పెదకూరపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళ రైతు మట్టుపల్లి ఉదయలక్ష్మి మిరప పొలంలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ఉదయలక్ష్మి ప్రకృతి వ్యవసాయం చేసి మంచి లాభాలు ఆర్జిస్తుందన్నారు. మిరప పంటలో అంతర్ పంటగా ముల్లంగి, ఉల్లి, బంతి, క్యారెట్ వేసి మంచి దిగుబడి సాధించారన్నారు. ఎటువంటి రసాయనాలు లేని ఆరోగ్యకరమైన కూరగాయలు పండిస్తున్న ఉదయలక్ష్మిని అభినందించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటించడం వల్ల పెట్టుబడి తగ్గుతోందన్నారు. భూమి సారవంతమై నీటి నిల్వ పెరుగుతోందన్నారు. కూరగాయాలు, దుంప పంటలు సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం లభిస్తోందన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయం ఎన్ఎస్ఏఎస్‌సీ సైదయ్య, ఎం.నందకుమార్, సత్తెనపల్లి డివిజన్ అధికారి మధుబాబు, యూనిట్ ఇన్‌చార్జి అమూల్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ముల్లంగి పంటను పరిశీలిస్తున్న అమలకుమారి

అయోధ్య రాముడి ప్రతిష్టాపన చిరస్మరణీయం

జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి

రెంటచింతల: అయోధ్యలో ఆలయ ప్రతిష్టాపన చిరస్మరణీయమని జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయనకు, ఎంపీపీ దాసరి చౌడేశ్వరికి పార్టీ నేతలకు స్థానిక రామాలయం కమిటీ సభ్యులు అయోధ్య రాముడి అక్షింతలు అందజేసిన నేపథ్యంలో నర్సిరెడ్డి మాట్లాడారు. ఈ నెల 22వ తేదీన అయోధ్యలోని భవ్యమందిరంలో జరగనున్న బాలరాముడి ప్రాణప్రతిష్ట దేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ పాశం శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల అధ్యక్షులు పూజల రామయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, ఎంపీటీసీ గుంటా ముక్కంటేశ్వరరెడ్డి, రామాయలం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, ఎంపీపీ చౌడేశ్వరిలకు అయోధ్య అక్షింతలు అందజేస్తున్న కమిటీ సభ్యులు

సమాచారం లేకుండా రైల్వేగేటు మూసివేత



పెదకూరపాడు: రద్దీగా ఉండే అమరావతి-సత్తెనపల్లి కాలచక్ర రహదారిలోని పెదకూరపాడు రైల్వే గేటును అధికారులు మరమ్మతుల పేరుతో ముందస్తు సమాచారం లేకుండా గురువారం మూసివేశారు. దీంతో సత్తెనపల్లి నుంచి పెదకూరపాడు, అమరావతి నుంచి సత్తెనపల్లి వెళ్లే ప్రయాణికులు, ఉద్యోగులు, వ్యవసాయ కూలీలు, రైతులు, తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా గేటు ఎలా మూసివేస్తారంటూ రైల్వే అధికారులపై మండిపడ్డారు. దీంతో అమరావతి నుంచి సత్తెనపల్లి వైపు వెళ్లే వాహన చోదకులు, ఆర్టీసీ బస్సులు, ఆటోలు, పెదకూరపాడు నుంచి సిరిపురం, భట్లూరు మీదుగా, లగడపాడు నుచి సత్తెనపల్లి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు గేటు మూసి మరమ్మతులు చేస్తూనే ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రత్యేక బస్సులు

అచ్చంపేట: విజయవాడలో శుక్రవారం ఉదయం 10గంటలకు జరిగే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవానికి అచ్చంపేట నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపారాణి తెలిపారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తారని చెప్పారు. ప్రత్యేక బస్సులు మాదిపాడు, చింతపల్లి, అచ్చంపేట, కొండూరు, గ్రంథశిరి, కోనూరు గ్రామాలలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నుంచి బయలు దేరుతాయన్నారు. దళిత సంఘాలు, అంబేడ్కర్ అభిమాన సంఘాలు, నిరుపేదల సౌకర్యార్థం ఈ ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరారు.

తుపాను పశు నష్ట పరిహారం అందజేత

విప్పర్ల(క్రోసూరు): ఇటీవల వచ్చిన మిచాంగ్ తుఫాన్‌లో క్రోసూరు మండలం విప్పర్ల గ్రామానికి చెందిన రైతు ఆవుల వెంకటేశ్వర్లుకు చెందిన నాలుగు గొర్రెలు, ఒక దూడ చనిపోవడంతో గురువారం రూ.36 వేల నష్టపరిహారం చెక్కును ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అందజేశారు. అదేవిధంగా నాగవరం గ్రామానికి చెందిన తోట చిన్న నాగేశ్వరమ్మకు చెందిన గేదె మరణించడంతో రూ.37,500 చెక్కును బాధిత రైతుకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో విపత్తులలో పశువులు నష్టపోయినప్పటికీ పరిహారం అందజేసేవారు కాదని, ఒకవేళ అందజేసినా సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేదని అన్నారు. మిచాంగ్ తుఫాన్ నష్టానికి సంబంధించి రెండు నెలల్లోనే పరిహారం అందజేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

-చర్చి శంకుస్థాపనలో ఎమ్మెల్యే నంబూరు..

మండలంలోని 88 త్యాళ్లూరులో నూతనంగా నిర్మిస్తున్న చర్చి శంకుస్థాపన కార్యక్రమంలో గురువారం పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చర్చి నిర్మాణం త్వరగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. నిర్మాణంలో తన వంతు సహకారం అందిస్తానని తెలియజేశారు. కార్యక్రమాల్లో పలువురు గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



విప్పర్ల గ్రామ రైతు వెంకటేశ్వర్లుకు నష్టపరిహారం చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పంట నమోదు సకాలంలో చేయాలి

పిడుగురాళ్ల: రబీ పంట కాలంలో పంట వేసిన ప్రతి ఒక్క రైతుకు పంట నమోదు కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలని పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి సూచించారు. పట్టణ జానపాడు రోడ్డులోని కేఎం కన్వెన్షన్ హాల్‌లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో పిడుగురాళ్ల సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల ఉద్యోగులకు సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉండే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రానున్న వేసవిలో రైతులు ఇంకుడు గుంతలు తీసుకోవాలంటే అటువంటి రైతుల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బి.జె.బెన్నీ మాట్లాడుతూ రైతులకు ఉద్యాన శాఖ అందించే పలు రకాల పథకాలు, వాటికి సంబంధించిన సబ్సిడీల గురించి రైతులకు అధికారులు అవగాహన కలిపించాలని అన్నారు. ఆర్‌బీకేల్లోని ఉద్యాన సహాయకులు ఈ పథకాల గురించి రైతులకు తెలియజేయాలని సూచించారు. పౌరసరఫరాల శాఖ అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లోని ఆర్‌బీకేల ద్వారా కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించటం జరిగిందని, కందులకు మద్దతు ధర ప్రకటించటంతోపాటు గన్నీ, లేబరు, రవాణా చార్జీలు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కె.సాయిమార్కొండారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాల గురించి ప్రతి రైతుకు తెలియాలని, అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా అధికారులు విధులు నిర్వహించాలని సూచించారు. అపరాల సాగుపై రైతులకు అవగాహనతో కూడిన శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమానికి పిడుగురాళ్ల ఏడీఏ శ్రీ కృష్ణదేవరాయలు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ఐదు మండలాల వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయండి

అంబేడ్కర్ ప్రజా సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు

అచ్చంపేట: మండలంలోని పుట్లగూడెం వద్ద గల బల్లకట్టుకు సమీపంలోని కోళ్లఫారంలో పనిచేస్తున్న బాపట్ల గోపి ఎస్టీ (యానాది) కులస్తునిపై కొందరు అగ్రవర్ణానికి చెందిన వారు ఈనెల 16న రాత్రి దాడులు నిర్వహించి తీవ్రంగా గాయపరచారని, కులం పేరుతో దూషించారని, వారిపై కఠిన చర్యలు తీసుకుని అరెస్ట్ చేయాలంటూ అంబేడ్కర్ ప్రజా సంఘం అధ్యక్షుడు దాములూరి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. తీవ్ర గాయాలతో గోపి ప్రాణాపాయ స్థితిలో సత్తెనపల్లిలోని ఓ ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొంతున్నాడన్నారు. కులం పేరుతో దూషించడమే కాకుండా, తీవ్రంగా గాయపరచిన వ్యక్తులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.



చికిత్స పొందుతున్న గోపి

కంది ధర ఆశాజనకం

దుర్గి: రైతులు తాము పండించిన కందులను ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లోనే విక్రయించి మంచి ధరను పొందాలని మండల వ్యవసాయ శాఖాధికారి వై.అమీర్‌రెడ్డి గురువారం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రోజు మార్కెట్ ధరను దృష్టిలో ఉంచుకొని కందులను కొనుగోలు చేస్తుందన్నారు. ప్రస్తుతం క్వింటా ధర రూ.9,385గా నిర్ణయించిందన్నారు. ప్రమాణాలు పాటిస్తూ ఈకెవైసీ ఈ క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారులకు అమ్మి నష్టపోవద్దని రైతులను కోరారు. ఈ నెలాఖరులోపు మండలంలోని అన్ని ఆర్‌బీకేల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని తెలిపారు.